# ప్రేమకు మించిన ధనము మరొకటి లేదు

నాస్తి జాగరతో నాస్తి కలహం
జపతో నాస్తి చింతనం
మౌనేన కలహం నాస్తి
నాస్తి జాగరతో భయం
కృషితో నాస్తి దుర్భిక్షం

ప్రేమస్వరూపులారా!

శ్రమించి పని చేయునట్టి మానవునకు సర్వసంపదలు చేకూరుతాయి. శ్రమించి పనిచేసే మానవునకు సకలసౌభాగ్యములు చేకూరుతుంటాయి. శ్రమించి పనిచేసే మానవునకు దుర్భిక్షమనేది ఉండదు. భగవన్నామము జపించే మానవునకు లోకచింత యేమాత్రము ప్రవేశించదు. మితభాష కలిగినవానికి కలహమనేది ఉండదు. అతిభాషచేతనే కలహమునకు ముందంజ వేస్తున్నాడు. కనుక, ప్రతివ్యక్తికి మితభాష అత్యవసరము. అందరిని మిత్రులుగా సోదరసోదరీమణులుగా భావించే నిమిత్తమై మితభాష అవసరము. జాగ్రత్తగా నిత్యానిత్యవిషయ పరిశీలనచేసి దివ్యమైన భావముతో నవ్యమైన హృదయముతో మధురమైన వాక్కుతో జీవించేవానికి ఎట్టి భయముండదు. ఇవన్నీ విద్యకు సంబంధించినవి;

**విశ్వశాంతిని చేకూర్చు విధము నేర్పి**
**సంకుచితభావములనెల్ల సమయజేసి**
**ఐకమత్యము సహజీవనాదికములు**
**సమత నేర్పుటయె కాదె సరసవిద్య**

**మానవులు మొట్టమొదట విభేదములు విస్మరించాలి**

srisathyasaivachanamrutam

లోకశాంతిని సంకల్పించుకొని విద్యలో ప్రవేశించాలి. కారణం ఏమిటి? ఈ విశ్వములో తానొకవ్యక్తి. సమాజములో తానొక వ్యక్తి. సమాజము, విశ్వము క్షేమంగా ఉండినప్పుడే తన క్షేమముకూడా అందులో ఉంటుంది. కనుక తన క్షేమాన్ని, తన శాంతిని, తన సౌభాగ్యమును ఆశించే ప్రతి వ్యక్తికూడా విశ్వసౌఖ్యాన్ని ప్రప్రథమముగా కాంక్షించాలి. సంకుచితమైన భావములు ఏమాత్రము చేర్చుకోరాదు. ఈ సంకుచిత భావములవలన సంకుచితమైన ఫలితములే మనకు సంభవిస్తున్నవి. కనుక, మనము అనుభవించే అవస్థలకుగానీ, అనందములకుగానీ మన భావములే మూలకారణము. ఈ భావమును పురస్కరించుకొనియే 'యద్భావం తద్భవతి' అన్నారు. మూడవది ఐకమత్యము సహజీవనాదికములు. సమత, సమగ్రత ఈ రెండు విద్యార్థి ప్రప్రథమములో నేర్చవలసినవి. ఇవి అధ్యాపకులు నేర్పేవికాదు. ప్రతి మానవునకు ప్రకృతియే ప్రథమ అధ్యాపకుడు. ప్రకృతియే సర్వవిద్యలు అభ్యసింపచేస్తున్నాది, మానవునకు. దేశము, భాష, భిన్న భిన్నమైన అభిరుచులు కలిగిన వ్యక్తులు తమతమ సంకుచితములను విస్మరించి ఐకమత్యముతో ఆటలాడటమే ఈ ఆటలకు తగిన సౌందర్యము. వ్యక్తి భేదములను విస్మరించి, సమగ్రతను అభివృద్ధి పరచుకొని సమైక్యతతో జీవించటమే మానవునకు ప్రధానగుణము. మానవులు మొట్టమొదట విభేదములు విస్మరించాలి. సమత్వాన్ని అభివృద్ధి గావించుకోవాలి. ఈనాడు మనము చేసే వ్యాయామమునందుగానీ, ఆటలయందుగానీ కేవలము దేహపుష్టిని, ఆరోగ్యమునే అందుకోగల్గుతున్నాము.

**మనోదేహములు ఆరోగ్యముగా ఉండినప్పుడే మానవుడు ఆనందమును అనుభవించగలడు**

మానవుడు కేవలము దేహముతోకూడినవాడు మాత్రమేకాదు. ఆరోగ్యమును, బలము సంపాయించినంత మాత్రమున చాలదు, జీవితమునకు. కడుపునిండినా మనసు పండాలి. కనుకనే మనసుకు తగిన ఆరోగ్యము తగిన రీతిలో సంపాయించుకోవాలి. మనోదేహములు ఆరోగ్యముగానుండినప్పుడే మానవుడు ఆనందమును అనుభవించగలడు. కానీ, ఈనాటి యువకులందరు దేహముయొక్క సౌందర్యము, దేహముయొక్క పుష్టిని మాత్రమే గుర్తించుకో గలుగుతున్నారు. మానవునియందు అనేక రకములైన శక్తులు ఇమిడి

యుంటున్నాయి. శారీర, మానసిక, ఆధ్యాత్మిక శక్తులు దైవానుగ్రహముచే ప్రాప్తించేవి. ఈనాటి యువకులు తమయందున్న దివ్యశక్తులను పెడమార్గము పట్టించి, దుర్వినియోగము గావించి దుఃఖమునకు గురౌతున్నారు. సమాజముయొక్క సమైక్యత విస్మరిస్తూ వచ్చారు. తమ శక్తులను తాము గుర్తించుకోలేకపోతున్నారు. భౌతికమైన లౌకికమైన ప్రాకృతమైన శక్తులే ప్రధానమని విశ్వసించి తమయందున్న అంతర్‌శక్తిని విచారించలేకపోతున్నారు. సమస్త శక్తులకు మూలకారణమైనది మనస్సు. ఈ మనసును అరికట్టినప్పుడే మానవుడు మాధవత్వమును పొందగలుగుతాడు. మానవుడు ఏ ప్రయత్నమునకు పూనుకున్నప్పటికిని అందులో అచంచలమైన విశ్వాసమును అభివృద్ధి పరచుకోవాలి. చంచలమనస్సు కల్గిన మానవుడు ఏ చిన్న కార్యముకూడ సాధించలేడు. అచంచల హృదయుడే సర్వస్వము సాధించగలడు.

**మానవుడు తనలోని శక్తులను సద్వినియోగము చేసుకోవాలి**

మనస్సును అచంచలరీతిగా తీర్చిదిద్దవలెనన్న మన శక్తులను సద్వినియోగము చేసుకోవాలి. ముఖ్యముగా విద్యుత్‌శక్తి. ఈ శక్తియే మన దృష్టి. ఇది కన్నులనే బల్బులద్వారా ప్రకాశిస్తుంది. కనుక, మన దృష్టిని సరైన దృష్టిగా, పవిత్రమైన దృష్టిగా, ఆనందకరమైన దృష్టిగా మార్చుకోవాలి. కలుషితమైన దృష్టిగా మార్చుకోకూడదు. మాలిన్యమైన భావముతో నీ దృష్టిని ఉపయోగించకూడదు. దుశ్చింతలతోకూడిన దృష్టిని ప్రవేశపెట్టకూడదు. అప్పుడు ఈ కన్నులనే బల్బులు పేలిపోతాయి అనగా ఆ శక్తిని కోల్పోతాము. ఇంక దేహమునందు సర్వత్రా వ్యాపించిన అయస్కాంతశక్తి. ఈ అయస్కాంతశక్తి ముఖ్యంగా హస్తమునందుంటున్నది. అందువలన మన హస్తములు సక్రమమైన మార్గములో, సరైన పనులలో ప్రవేశపెట్టాలి. ఈ హస్తములతో పరులకు అపకారమయ్యేది, బాధించేది, హింసించేది చేయకూడదు. తదుపరి మన శరీరమునందు కాంతికిరణములుంటున్నవి. ఈ కాంతికిరణములు విద్యుత్‌శక్తి తరంగములచే సర్వత్రా వ్యాపించి ఉంటున్నాయి. డిల్లీలో రేడియోస్టేషన్‌లో పాడుతుంటే ఆ గానము అప్పటికప్పుడే మన చెవులలో ప్రవేశిస్తున్నాది. అదియే కాంతిశక్తి. సర్వత్రా వ్యాపించి శబ్దముతోకూడిన ఈ కాంతిశక్తిని మనము

sri sathyasai vachanamrutam

దుర్వినియోగము చేసుకుంటున్నాము. ఎప్పుడూ శ్రవణానందమును అందించే మాటలను మనం వినటంలేదు. పరనింద, పరదూషణ, పరులను హాస్యముచేసే శబ్దములనే మనము శ్రవణము చేస్తున్నాము. ఈ కర్ణములు పెడమార్గము పట్టిపోతున్నాయి. ఇక వాక్కు. ఇది సర్వశక్తులతోకూడి ఉంటున్నది. వాక్కును సరైన జాగ్రతతో ఉపయోగపెట్టుకోవాలి. ఇతరులవలన ఏ శబ్దము వింటే ఏ విధంగా మనం బాధపడతామో ఏ ఏ విధంగా మన మనస్సును కష్టపెడతుందో జాగ్రత్తగా మనం విచారించి పలికే పలుకులను ప్రవేశపెట్టాలి. ఈ వాక్‌శక్తికి reaction, reflection, resound ఉంటుంది. ఇతరులు నీ శబ్దముచేత బాధపడినట్లే నీవుకూడా బాధపడుతావు. మనము దుర్భావములు, దుశ్చింతనలలోకూడిన వాక్యములను పలికినప్పుడు అవి బయటవారిని బాధపెట్టినదానికంటె తిరిగివచ్చి మనలనే ఎక్కువ బాధపెడతాయి. కనుకనే you can't always oblige but you can speak always obligingly, అన్నారు. కనుక, మనము మంచి పలుకులను ప్రవేశపెట్టాలి. ఈ విధముగా మానవుడు తనయందున్న అనంతశక్తులను దుర్వినియోగ పరచుకుంటున్నాడు.

**మానవత్వమును సార్థకము గావించుకొనవలెనన్న ఒకే నాలుక, ఒకే పలుకు**

ఈనాటి యువకులలోనున్న బలహీనత ఇదియే! ఒక్క నిమిషములో తాను ఎంతో మంచిగా మాట్లాడుతాడు. మరునిమిషములోనే దానికి విరుద్ధముగా పలుకుతాడు. ఇది అతని మానవత్వమునకే అవమానకరముగా ఉంటుంది. మానవత్వమును సార్థకము గావించుకొనవలెనన్న ఒకే నాలుక, ఒకే పలుకు. మంచిచెడ్డలందుగానీ, లాభనష్టములందుగానీ, కీర్తిఅపకీర్తులందుగానీ సమత్వమును వహించాలి. ఈనాటి యువకులందు ఆవేశము, ఆతృత ఎక్కువై దుర్వాంఛలచేత దుష్టులుగా తయారౌతున్నారు. చదువులు మాత్రం అధికంగా చదువుతున్నారు. కానీ, ఈ గుణములు చదువులో లేవనే సత్యాన్ని వారు గుర్తించుకోలేకపోతున్నారు. ప్రపంచములో ఎందరో గొప్ప గొప్ప విద్వాంసులు ఉన్నారు. ఈనాడు ప్రపంచములో మేధావులుగానీ, అనేక రకములుగా కీర్తి సంపాయించిన వ్యక్తులుగానీ వారికి ఈ కీర్తి ఏ విధంగా వచ్చింది? వారి నడతలవలనే ఆ కీర్తి సంపాయించగలిగారు. ఏ దేశములో చూచినా విద్యావంతులు ఎక్కువగా

కనిపిస్తున్నారు. కీర్తి సంపదలు సాధిస్తూ వచ్చారు. నోబుల్ ప్రైజుకూడా అందుకోగలుగుతూ వచ్చారు. కానీ, వారి పేర్లు కేవలం గ్రంథాలలో నిల్చిపోయినవిగానీ మనుషుల హృదయాలలో నిల్చిపోలేదు. పవిత్రమైన భావములతోకూడినవారిపేర్లు అందరి ప్రజల హృదయాల్లో నిల్చిపోవాలి. ఒక చిన్న ఉదాహరణము. కలకత్తాలో గొప్పగొప్ప విద్వాంసులు ఉండేవారు. కానీ అలాంటి విద్వాంసుల పేర్లుకూడా మంచుగడ్డ కరిగిపోయినట్లు కొన్ని సంవత్సరములలోపల మారిపోతూవచ్చాయి. కాని, ఒక్క అక్షరమైనా తెలియని రామకృష్ణపరమహంస యావత్ప్రపంచములో సర్వుల హృదయముల లోపల నిరంతరము హత్తుకుపోయి ఉన్నాడంటే దీనికి విద్యయా కారణము? అదే విధముగా అనేకమంది మహనీయులు ప్రజల హృదయాల్లో ప్రతిష్ఠ అయినారంటే దీనికి కారణము ఏమిటి? దైవచింతనచేత, దానభావముచేత, త్యాగశీలముచేత అలాంటి పేరు వారికి సార్థకమైంది.

### దృష్టి భగవంతునిపై లగ్నము చేసినప్పుడు ఎటువంటి ప్రమాదములు సంభవించవు

మొన్న ప్రైమరీస్కూలు పిల్లల కార్యక్రమంలో ఒక చిన్నబిడ్డ కృష్ణునిగా పాముపైన తాండవమాడుతున్నది. మీరు అందరు చూచారు. అక్కడ పటాసు కాల్చటంచేత అగ్ని బట్టలకు అంటుకుంది. మంటలు పెరుగుతూ వచ్చాయి. పోలీసులు, వాలంటీర్లు, ఇంకా ఇతర పిల్లలు అందరు బకెట్లుతో నీరు తీసుకుపోయి మంటలార్పడానికి ప్రయత్నం చేశారు. చాలా గలాటాగా ఉంటున్నాది. కానీ ఆ పిల్లవాడు ఏకాగ్రతతో ఏమి జరుగుతున్నదో, ఎవరు వస్తున్నారో ఎవరు ఏమి చేస్తున్నారో ఏమీ చూడలేదు. స్వామియందు ఏకైక దృష్టితో వాడు డాన్సు చేస్తున్నాడు. తన దృష్టిని స్వామిపైనే నిలిపాడు. దృష్టి భగవంతునిపై వుండినప్పుడు ఎట్టి ప్రమాదములు సంభవించవు. చుట్టూ కాగితములతో చేసిన అలంకారములుంటున్నాయి. వాటి మరుగున 500మంది పిల్లలు కూర్చున్నారు. అదంతా అంటుకొని వుంటే ఏమి గతి? పర్వతమువలె వచ్చిన ప్రమాదములుకూడా భగవచ్చింతనచేత మంచువలె మాయమైపోతాయి. ప్రకృతిభావముతోబాటు పరమాత్మ చింతన అత్యవసరము. చదువులతోబాటు సంస్కారము అత్యవసరము. సంస్కారము అంటే ఏమిటి? బాగా తెలుసుకొనుట. 'లోకాస్సమస్తా సుఖినోభవంతు' ఇందులోని సారము

ఎవరూ గుర్తించుకోటంలేదు. అందరు క్షేమంగా ఉంటుండాలి. ఇలాంటి భావమే దైవముయొక్క ప్రమాణము. అదియే ఆధారము. దారులు కాసి దోచుకునే దొంగగా ఉన్న రత్నాకరుడు సప్తఋషుల ప్రబోధలచేత నిరంతరము రామచింతన చేస్తూ వచ్చాడు. రామచింతనచేస్తూచేస్తూ రాముని తేజస్సు అతని ముఖములో ప్రవేశించింది. అతనే రామాయణమునకు ప్రధానదాతగా మారాడు. దారులుకొట్టే దొంగ ఈ విధంగా ప్రపంచవ్యాప్తముగావించే రామాయణమునకు దాతగా మారటం ఎంత అదృష్టము. అతను ఏ చదువులు చదవలేదు. ఏ యూనివర్సిటికి పోలేదు. ప్రపంచములో రామాయణమంటే వాల్మీకి అనిపేరు నిలచిపోయింది. ఏది చేసినా భగవత్కార్యముగా తాను భావిస్తూ వచ్చాడు. వ్యాసుడు 18 పురాణములు వ్రాసాడు, ఇంకా మహాభారతమునుకూడా వ్రాసాడు. దేశమునకు ప్రబోధించాడు. వారియందు దివ్యభావము ఉండటంచేతనే ఈనాడు ప్రపంచములో వ్యాస, వాల్మీకి మహర్షుల పేర్లు ప్రతిష్ఠ అయిపోయినాయి. ఇక భాగవతమును రచించిన పోతన. అతను ఏ భావముతో భాగవతము ప్రారంభించాడు?

**పలికెడిది భాగవతమట**
**పలికించెడివాడు రామభద్రుండట నే**
**పలికిన భవహరమగునట**
**పలికెద వేరొండుగాథ పలుకగనేలా?**

పలికేది రాముడే, పలికించేదీ రాముడే, వ్రాసేది రాముడే, అనుభవించేది రాముడే అనే రామార్పిత భావముతో ప్రారంభించాడు. భాగవతము అంటే పోతన జ్ఞాపకము వస్తాడు. అందరి హృదయాల్లో పోతన నిల్చిపోయాడు.

### ప్రాపంచిక జీవితముతోబాటు ఆధ్యాత్మిక జీవితముకూడా అలవరచుకోవాలి

చదువులు గ్రంధాల్లో నిల్చిపోవటంకాదు, ఈనాడు మనం కోరవలసింది. హృదయాల్లోపల నిల్చిపోవాలి. ప్రజల మనస్సుల్లో దివ్యకాంతిని వెలిగించాలి. అజ్ఞానాంధకారములో మునిగిన మనస్సులను ప్రకాశవంతముగా మార్చాలి. మనస్సులో ఉన్న చీకటిని ఇట్టిది అట్టిది అని ఎవరు వర్ణించలేరు. ఒకప్పుడు కృష్ణుని దివ్యసందేశమును

srisathyasaivachanamrutam

తీసికొని తమ వద్దకు వచ్చిన ఉద్ధవునకు గోపికలు చెబుతున్నారుః

**మబ్బుగ్రమ్మిన మా మానసవీధిలో**
**కృష్ణభానుని తేజము నిలుపమనుమా!**

మబ్బు గ్రమ్మిన మా మానసవీధిలో 'కృష్ణా' అనే జ్యోతిని వెలిగించమని చెప్పారు. ఒక్కొక్కరు ఒక్కొక్క విజ్ఞాపన చేసుకున్నారు, ఇలా

**చెదరిపోయిన నాదు జీవితసుమమాల**
**చెలువార కూర్చి ధరియించమనుమా!**
**ఎండబారిన మాదు జీవిత వృక్షములు**
**చిగురుబెట్టగ చేయుమనుమా!**

"మా జీవిత వృక్షమంతా ఎండబారి బెండుతీరిపోయింది. కారణం ఏమిటి? భగవంతుని కరుణ లేకపోవటంచేతనే! భగవంతుని సన్నిధి లేకపోవటంచేతనే! మా పెన్నిధి మేము కోల్పోవటంచేతనే! అంతా ఎండిపోయింది, జీవితము. అతని దర్శనస్పర్శనసంభాషణలచేత మా జీవిత వృక్షాన్ని చిగురుపెట్టవలసింది". మానవజీవితం ఏ విధంగా వుండాలి? ప్రాపంచిక జీవితము అవసరమే! కానీ దానితోబాటు ఆధ్యాత్మికజీవితముకూడా అలవరచుకోవాలి. ఆనాటి గోపికలు, గోపాలురు కృష్ణుని ఈ విధంగానే కోరుతూవచ్చారు. 'కృష్ణా నిన్ను వదలి మేము ఉండలేము. నీ నామాన్ని మరచి మేము జీవించలేము. కనుక నీవు ఏ రూపము ఎత్తినా, ఏ నామము ధరించినా దానితోబాటు అనుబంధమైన రూపాన్ని మాకు అనుగ్రహించమని' కోరారు

**వృక్షంబువై నీవు వర్ధిల్లుచుండిన**
**వల్లికనై నేను అల్లుకొందు**
**వరసముద్రుడే నీవైన వాహిని అగుచు**
**నీలోన ఐక్యమగుదు**
**అనంత ఆకాశమే నీవైన కృష్ణా**
**చిన్నచుక్కనై నీలోన వెలుగుచుందు**

srisathyasaivachanamrutam

**మేరుపర్వతమె నీవైన పరచుకొని**
**పారెద నేను సెలయేరునై**

నీకు, మాకు ఏమాత్రము ఎడబాటు ఉండకూడదు. ఆ ఎడబాటు లోకవాంఛలకు మూలకారణము. దైవాన్ని మర్చిపోవటంచేత దేహాన్ని మనం అనుభవిస్తున్నాము. దేహాభిమానములచేత సుఖదుఃఖములను మనము పొందుతున్నాము. సమస్త సుఖదుః ఖములకు దేహమే మూలకారణము. అట్టి దేహమును పవిత్ర మార్గములో ప్రవేశపెట్టాలి. కావున చదువులతోబాటు సంస్కారమును కొంతవరకు అలవరచుకోవాలి. ఎంత చదువులు చదివినా మానవ జీవితము తనతోబాటే పోతుందిగానీ లోకములో ఏమాత్రము నిలిచేదికాదు. జీవనోపాధికి మాత్రమే పనికి వస్తాయిగానీ జీవితపరమావధికి పనికిరావు లౌకిక చదువులు. చదివినవారంతా ఏ సుఖాన్ని పొందారు? ఉన్నంతవరకు ధనము సంపాయించటము, దేహసంబంధమైన సుఖములు అనుభవించటము, అనేక రకములైన ప్రవర్తనలలో జీవితమును అంత్యముగావించుకోటం. అంత్యము అందరికి సత్యమే, సహజమే. ఆ అంత్యములోపల ఆనందమును పొందాలి.

**భగవంతుడు ఎన్నడు భక్తుని మరువడు**

ఈనాడు 'భగవంతుడు మరచాడు, భగవంతుడు వదిలాడు', అని అనుకుంటున్నారు. కానీ భగవంతుడు మరచటంకాదు. భగవంతుడు వదలటంకాదు. భక్తులే వదులుతున్నారు. God never forgets His devotees, devotee forgets God. God is never away from you, భగవంతుడు దూరమైపోతాడు అనుకుంటున్నారు కాదు కాదు. భగవంతుడు ఎప్పుడూ ఉంటున్నాడు. నీవు మరచిపోయి భగవంతుడు మరచిపోయాడని భావిస్తున్నావు. నీవు తిన్నది నీకు త్రేపుగా వస్తున్నది. ఏ దుర్భావములు నీలో వస్తున్నాయో అవి నీవేగానీ బయటివారివికావు. ఈ సత్యమును విద్యలో చక్కగా గుర్తించటానికి ప్రయత్నించాలి. ఈనాడు లోకములో ఈ విద్యలచేత ఏ విధమైన అవస్థలకు గురౌతున్నారు? ఏ సమావేశము జరిపినప్పటికి ఒకరిని ఒకరు విమర్శించుకోటమే జరుగుతున్నాది. ఏ సభలు జరిగినప్పటికి వీరిని వారు, వారిని వీరు తుచ్ఛమైన పదములచేత విమర్శించుకుంటున్నారు. నిజంగా

sri sathyasai vahini vachanamrutam

యోచన చేసి విచారించినప్పుడు విమర్శించేటువంటివాడు కేవలము అవివేకి. సంకుచితమైన హృదయము కలిగినవాడే ఇతరులను విమర్శిస్తాడు. అంతేకాదు, సరైన పేరు పెట్టాలంటే నీచులే ఇతరులను విమర్శించటానికి పూనుకుంటారు. ఎవరిని విమర్శించకూడదు. ఒకవేళ అతను చేసినది తప్పు అని తెలుస్తే అతనికి స్వయంగా వెళ్లి చెప్పు, 'నీవు చేసినది తప్పు' అని. ఆ విధంగా చెప్పటానికి సాధ్యముకాకపోతే అట్టి తప్పులు నీవు చేయకుండా చూచుకో! అంతేకానీ ఒకరిని ఒకరు విమర్శించే అధికారము ఈ జగత్తులో ఎవరికి లేదు. ఆ విమర్శించే వ్యక్తి ఏ మంచిని చేయగలుగుతున్నాడు?

**ఇతరులను సరిచేయాలనుకున్నప్పుడు మొట్టమొదట నీలోని దుర్భావములు నీవు దూరము చేయాలి**

ఈనాడు పెద్దపెద్ద నాయకులందరు విమర్శలలోనే కాలాన్ని వ్యర్థము చేస్తున్నారుగానీ తద్వారా వీరు ఎలాంటివారని విచారణచేస్తే వీరంతా తుచ్ఛులు అని నిర్ణయమవుతున్నాది. పరదూషణ అన్నింటికంటె పెద్ద పాపము. నిజముగా సంకుచితమైన బుద్ధి కలిగినవారే ఇతరులను విమర్శిస్తారు. నీ మంచిని నీవు పెంచుకో! నీ మంచిని పంచుకో! అంతేగాని పరులను ఏమాత్రము నిందించకూడదు. నిన్ను నీవు నిందించుకోటానికి కృషిచేయాలి. ఈనాటి యువకులలో ఇలాంటి దుర్భావములు, దురాలోచనలు, దుర్గుణములు అమితంగా పెరిగిపోతున్నాయి. తన స్వార్థము, స్వప్రయోజనాన్ని లక్ష్యమునందుంచుకుంటున్నారేగానీ సమాజముయొక్క క్షేమముగానీ లేక దైవభావముగానీ, దివ్యమైన హృదయముగానీ వారిలో ఏమాత్రము కనిపించటములేదు. తన భావము నెరవేరిన సంతోషిస్తాడు. నెరవేరకపోయిన పరులను దూషిస్తాడు. పరులను మాత్రమేకాదు పరమాత్మనుకూడా దూషిస్తాడు. అది సరైనదికాదు. ఈనాటి యువకులలోపల ఒక పవిత్రమైన పునాది కావాలి. 'నేను పుట్టినది దేనికోసమని? కేవలము తిని, త్రాగి, తిరిగి చనిపోవటంకోసమా? కాదు కాదు, ఆదర్శవంతమైన జీవితాన్ని అందించటంకోసం వచ్చాను. సమాజసేవలో నేను పాల్గొనాలి. నా సమాజంలో ఇతరులను నేను సరైనరీతిలో ఆదుకోవాలి. నా క్షేమము సమాజంలో ఉంటున్నాది', అని దృఢ నిశ్చయం చేసుకోవాలి. ప్రతివ్యక్తి సమాజసేవకు

srisathyasaivachanamrutam

ముందంజవేయాలి. సమాజములోనున్న దుష్టత్వమును తుడిచివేయాలి. అంతకు పూర్వము నీలో ఆ దుష్టత్వము లేకుండా చూచుకోవాలి. పరక చాలా గలీజుగా ఉండినప్పుడు దానితో రూము ఏ విధంగా శుభ్రము చేయటము? మన గదిని మనం శుభ్రము చేసుకోవాలంటే ఊడ్చే పరక శుభ్రముగా వుండాలి. అదే రీతిగా మొట్టమొదట ఇతరులను సరిచేయాలనుకున్నప్పుడు నీలోని దుర్భావములు దూరము గావించుకోవాలి.

**మన కర్తవ్యము మనము చక్కగా నిర్వర్తించినప్పుడు జయాపజయములు దైవమే అందిస్తాడు**

ఈనాడు ఆటలు, పాటలు, మాటలు అన్నీ వ్యాపారరంగముగా మారిపోతున్నాయి. కాదు కాదు, మన ఆత్మాభివృద్ధి నిమిత్తమై, మన ఆనాందాభివృద్ధి నిమిత్తమై, మన ఆరోగ్య నిమిత్తమై యీ ఆటలను ప్రారంభించినాము. అందరు ఐకమత్యంగా ఆటలు ఆడినారు. అయితే ఇందులో ఏ స్వార్థము ఉండకూడదు. నీయొక్క కర్తవ్యము చక్కగా నిర్వర్తించు. జయాపజయములు దైవమే అందిస్తాడు.

**యత్నప్రయత్నముల్ మానవధర్మము**
**జయాపజయములు దైవాధీనములు**

నేను ఉత్తమమైన స్థానమును సాధించాలి, విజయాన్ని పొందాలి అని ఏ పట్టుదలతో, ఏ ఆనందముతో, ఏ కృషితో, ఏ శ్రద్ధతో పని చేస్తున్నారో ఆ శ్రద్ధా, ఆ భక్తి, ఆ కృషి, ఆ క్రమము అన్ని రంగములందు నీవు ప్రవేశపెట్టాలి. కేవలము games నందు మాత్రమే విజయాన్ని సాధించాలనుకోటం చాలా సంకుచితమైన భావము. మనకు విశాలమైన భావము రావాలి. Gamesలో ఏవిధంగా విజయాన్ని సాధిస్తావో lifeలోకూడా అదే విధంగా విజయాన్ని సాధించాలి. క్లాసులో అందరిలో ఏవిధంగా 1st marks తెచ్చుకున్నావో అదే విధంగా జీవిత ఆదర్శములోకూడా 1stగా ఉండాలి. భగవత్ అనుగ్రహమనే బహుమతి పొందాలి. ఇవి వస్తుంటాయి, పోతుంటాయి. 'బహుమతి', చాలా విచిత్రమైన పదము. ఒక మతి ఉంటేనే మానవుడు అనేక అవస్థలకు గురౌతున్నాడు. బహమతులుంటే వీని గతి ఏమవుతుంది? అనేక మతులుగా ఉండినప్పుడు వీని గతి చెప్పనక్కరలేదు. ఈ బహుమతులు కాదు, మనం పొందవలసినవి. ఏకమతిచేతనే అనంతత్వాన్ని సాధించాలి.

sri satyasai vachanamrutam

అదే గోపికలు బోధించినది. ఉద్ధవుడు వచ్చి 'అమ్మా! కృష్ణుని సందేశము తెచ్చాను. మీరు యశోద ఇంట్లో సమావేశము కండి. అతని వార్తను మీకు అందిస్తాను', అన్నాడు. అప్పుడు గోపికలు చెప్పారు, 'ఉద్ధవా! మాకు పది మనసులులేవు. మాకు ఉన్నది ఒకే మనసు, ఆ మనసుకూడా కృష్ణునితో మథురకు వెళ్లిపోయింది. నీ ఉపన్యాసములు, నీ వార్తలు వినటానికి మాకు యింకో మనసు లేదు. కనుక వచ్చినదారిని వెళ్లిపో'మని చెప్పారు. అనగా ఏమిటి? వారిది ఒకే హృదయము, ఒకే మనస్సు. ఉద్ధవుడు కృష్ణుని దగ్గరకు వెళ్లి 'కృష్ణా నేను ఏదో గొప్పవాడను అనుకున్నాను. ఇది నా అహంకారము, ఇది నా అజ్ఞానము

**అత్తలు మొత్తుకున్న మరి భర్తలు కత్తులు నూరుచున్న**
**నోరెత్తరు, కోపగించరు, ఎటకేగరు, భీతిలబోరు గోపికల్**
**పొత్తములందు చిత్తరువురీతిగ నుండెను కృష్ణుడు వారిలో!**

అని చెప్పాడు. ఆ విధంగా కాగితములో ప్రింటుకొట్టినట్లుగా గోపికల హృదయమనే కాగితములో కృష్ణుడు హత్తుకొనిపోయాడు. వేరు చేయడానికి వీలుకాదు. అదీ నిజమైన ఆధ్యాత్మికతత్త్వము. హృదయములో అన్నింటిని చేర్చుకొని పెద్ద చేపలబజారు మాదిరి చేసుకోటము కాదు, మానవుల తత్త్వము. హృదయము fish marketలా ఉంటున్నాది. ఏచూపుచూచినా దుర్గంధమే! ఏది విన్నా దుర్గంధమే! అంతా దుర్భావములతోనే నిండి ఉంటున్నాది, హృదయము. ఇదా విద్యకు అభివృద్ధి? ఇదికాదు. అనేకమంది ప్రోగ్రెస్సు, ప్రోగ్రెస్సు అనుకుంటున్నారు.

**విద్యార్థులు ఆదర్శప్రాయులు కావాలి**

**నీతినియమాలు గ్రంథాల నిలిచిపోయె**
**హృదయమంతయు దుర్గంధ సదనమయ్యె**
**చేతులన్నియు స్వార్థంపు చేతలయ్యె**
**ఇదియె ప్రోగ్రెస్సు ఈనాడు విద్యలందు**

**కూడుబెట్టిన వానినే కూలద్రోయు**
**విద్య చెప్పినవారినే వెక్కిరించు**

sri sathyasai vachanamrutam

**మేలు చేసిన వానికే కీడు చేయు**
**ఇదియె ప్రోగ్రెస్సు ఈనాడు విద్యలందు**

ఎవరు విద్యనేర్పారో వానినే వెక్కిరిస్తున్నాడు. ఎవరు మేలుచేశారో వారికే కీడు చేస్తున్నారు. ఇది కాదు విద్య. మేలుకు మేలు, కీడుకుకూడా మేలే చేయాలి. ఉపకారికి ఉపకారము చేయటం గొప్పతనంకాదు. అపకారికి ఉపకారము చేయు. అదియే ఈనాడు విద్యార్థులు నేర్చుకోవాలి. ఎవరిని ద్వేషించకూడదు. ప్రేమతత్త్వమును ఈనాడు పెంచుకోవాలి. జీవితమనే సంగ్రామములో విజయాన్ని సాధించటానికి ప్రయత్నించాలి. ఏమిటి ఈ విజయము? ఆదర్శవంతమైన విద్యార్థి కావాలి. తల్లితండ్రులను సేవించు. తదుపరే సమాజములో నీవు ప్రవేశించు. సమాజములోనున్నవారినందరిని సేవించి వారిని సంతృప్తిపరచు. యువకులైన మీరు నేర్చుకోతగినది ఎంతనో ఉంటున్నది. మొట్టమొదట అహంకారమును అణగదొక్కాలి. ఉడుకు రక్తము మహాస్పీడుగా బయలుదేరిపోతుంది. ఈ సమాజములో ఏదిమంచి, ఏదిచెడ్డ అనే విచక్షణా జ్ఞానాన్ని కోల్పోతుంటారు. మనకున్నది ఒకే నాలుక. దీనిలో ఒకే మాటను ఉపయోగపెట్టాలి. ఒక దానిని రైటు అని తరువాత దానినే రాంగ్ అనడము రెండు నాలుకల పాము మాదిరి వుంటుంది. చాలా విషమయమవుతుంది.

## భగవంతుని సంతృప్తిపరుస్తే జగత్తంతా సంతృప్తి చెందుతుంది

'నీవు విద్యావంతుడవు, గుణవంతుడవు, సాహసవంతుడవు, త్యాగశీలుడవు, నిర్మల హృదయుడవు, నిస్వార్థపరుడవు' అనే చక్కని కీర్తిని సాధిస్తూరావాలి. భగవంతుని సంతృప్తిపరుస్తే జగత్తంతా సంతృప్తి అయిపోతుంది. మొన్న చూచారు. 'గోరాకుంభార్' అని. అతను దైవనామం చేస్తూ కుండలు చేసే మట్టిని త్రొక్కుతూ తన్మయత్వముచేత తన కుమారుని మట్టిలో వేసి చంపుకున్నాడు. అనగా దైవచింతనచేత తన దేహాన్ని మరచాడు. కడపటికి తన దోషము తెలుసుకున్నాడు. ఆ తెలుసుకొని భగవంతుని ఏమైనా నిందించాడా? లేదే! పైగా 'ఓ రంగా! ఇచ్చినవాడు నీవే, పుచ్చుకున్నవాడు నీవే! ఇచ్చిపుచ్చుకునే శక్తులు రెండు నీయందే ఉంటున్నవిగానీ మేమంతా తోలుబొమ్మలము', అని సరిపెట్టుకున్నాడు. ఆ విధమైన భావముచేత తమ మనస్సును నిగ్రహించుకుంటూవచ్చాడు.

sri sathyasai vachanamrutam

కనుక, ఎటువంటి కష్టములందైనా, నష్టములందైనా, దుఃఖములందైనా, విచారములందైనా ఎన్ని మరచినా దైవచింతన మరచకూడదు. అన్నీకూడా కదలిపోయే మేఘములే! కానీ నీ హృదయము ఎప్పుడు శాశ్వతము. చదువులు చదవండి. 'లోకహితే రతః' అన్న విషయాన్ని మొట్టమొదట దృష్టిలో పెట్టుకోండి. లోకముయొక్క హితము, లోకచింతన చేస్తూరావాలి. జగత్తుయొక్క క్షేమాన్ని మనం కోరాలి. సమాజముయొక్క అభివృద్ధిని మనం ఆశించాలి. సేవలో పాల్గొనాలి.

**ఆశించటం అధికం, అందించటం స్వల్పం కావటంచేతనే భారతదేశము బీదదేశముగా తయారవుతున్నది**

మనం చదివిన చదువులు ఏ విధంగా ఉపయోగపెట్టాలి? ఆఫీసుకుపోయి అక్కడ వారు చెప్పిన పనిచేసి నెలజీతము పుచ్చుకొని ఆ విధంగా చదువులు దుర్వినియోగము చేయటముకాదు. నీవు నీ చదువును అమ్ముకుంటున్నావు. చదువును అమ్ముకోటం చాలా పాపము. నిత్యజీవితముకోసం ఉద్యోగము చేయవచ్చును. దానికి తగిన పనిని మనం అందించాలి. ఎంత జీతాన్ని మనం తీసుకుంటున్నాం, ఎంత పనిని మనం చేస్తున్నాం? అక్కడకూడా discrimination కావాలి. తీసుకోటం వేలకువేలు జీతాలు, నూరురూపాయలు పనికూడా చేయకుండా పోవటము దేశానికే ద్రోహం చేసినవారౌతారు. ఇలాంటి దేశద్రోహులు జగత్తులో వ్యాపించిపోతున్నారు. ఆశించటం ఆధికము, అందించటము స్వల్పము. అందువల్లే భారతదేశము ఒక బీదదేశముగా తయారైపోతున్నాది. ఉద్యోగుల జీతాలనిమిత్తమై దేశదేశములనుండి డబ్బు అప్పుతెచ్చుకుంటున్నాది. దీనికి కారణం ఎవరు? మీరే దీనికి కారణం. ఉద్యోగులంతా తగిన పనిచేస్తే దేశము ఇంత బీదస్థితిలో ఉండదు. ఇది కేవలము దేశద్రోహంగా భావించాలి. ఆ భావము మీలో ఉండినప్పుడే మీరు బాగుపడతారు. కానీ 'దేశము ఏమైతే నాకేమి? నాకు దండిగా జీతముకావాలి, జీతము రావాలి', అని ఏసీ రూములో కూర్చుని నిద్రపోతూంటారు. ఏమైన పని చేస్తున్నామా మనము? నీ ఆత్మసాక్షిగా నీవు పనిచేయాలి. అదే నీ ఆత్మతృప్తి. ఈ విషయంలో మన విద్యార్థులు చక్కగా ఆదర్శము నిరూపించాలి. జీతము తీసుకో, తప్పులేదు. కాని జీతానికి

sri sathyasai vachanamrutam

తగిన పనిచేయాలి. ఏ చదువుచదివినా ఎంత జీతం వస్తుంది అనే యోచనలోనే ఉన్నాడుగానీ, ఎంత పని నేను సమాజమునకు అందించగలను, ఎంత మేలు నేను సమాజానికి చేయగలను అనే భావము ఏ విద్యార్థియందు కనిపించటంలేదు. నానుండి జగత్తుకు, సమాజమునకు ఏమి మంచి జరుగుతున్నాదని యోచించాలి. సమాజమునుంచి నాకు ఎంత వస్తుందని యోచించకూడదు. అలా సమాజమునుండి ఎంత వస్తుంది అనేవారు పరమస్వార్థపరులు. కనుకనే వేదము చెప్పింది 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానసుః', అని.

**ఈనాటి సమస్త కలహములకు ధనమే మూలకారణం**

విద్యార్థులారా! విద్యార్థినులారా! మీరు ఎక్కడకు వెళ్లినప్పటికి, ఏ పని చేసినప్పటికిని, ఏ ఇంటిలో ఉండినప్పటికిని ఆదర్శవంతమైన జీవితాన్ని ఆ ఇంటివారికి, ఆ సమాజానికి, తల్లితండ్రులకు అందించటానికి తగిన కృషిచేయాలి. విద్యార్థులకు ప్రధానమైనది డిసిప్లిను. ఆ డిసిప్లిను కేవలం కాలేజిలో ఉండినంతవరకు, హాస్టలులో ఉండినంతవరకు చాలదు. మన నీడ మనము ఎక్కడకు వెళ్లినా ఏ విధముగా వెంటాడుతుందో ఆ విధంగా క్రమశిక్షణ ఎక్కడకు పోయినా ఉంటుండాలి. తరువాత డ్యూటీ. నీ డ్యూటీని సిన్సియర్‌గా చెయ్యి. అప్పుడే నీ హృదయానికి ఆనందము చిక్కుతుంది. నీవు దండిగా ధనము సంపాయిస్తున్నావు. కాని, తక్కువ పని చేయటంచేత ఏవిధంగా నష్టం కలుగుతున్నాదో హెచ్చరిస్తాను. వచ్చింది కావలసినంత ధనము. అది ఏదో ఒక రీతిగా ఖర్చయిపోతుంది. ఇంటిలో రోగాలైనా అధికమైపోతాయి. రోగాలు కారణంగా డాక్టరుకు ధనము చెల్లిస్తున్నారు. లేకపోతే దొంగలు దానిని అపహరిస్తున్నారు. లేదా అగ్ని ధనమును దహించవచ్చు. ఇంకా టెక్సురూపంగా ప్రభుత్వం తీసుకోవచ్చు. కొందరు ధనము ఇంటిలో పెట్టుకుంటే ఏమైపోతుందోనని ఎవరో స్నేహితునికి ఇస్తారు. కట్టకడపటికి నీకు అడిగేందుకు ధైర్యంలేదు వాడు తిరిగి ఇచ్చేందుకు ఇష్టపడడు. ఇది ఇంక అంతే. నీకు కష్టపడినంత ఫలితమే చేతికి చిక్కుతుందిగాని మిగిలినదంతా ఏదో మార్గములో వ్యర్థమైపోతుంది. కాళహస్తి అనే క్షేత్రం ఆంధ్రప్రదేశ్‌లో గలదు. మీకు తెలుసు. ఆ

srisathyasaivachanamrutam

కాళహస్తిలోపల సువర్ణముఖి అని ఒక నది ఉంటున్నది. ఆ నది ఒడ్డున అగస్త్యుడు అనే ఒక మహర్షి ఉండేవాడు. అతడు భగవంతుని మందిరము ఒకటి నిర్మించాలని పూనుకున్నాడు. ఆడవారు, మగవారు ఎంతో శ్రద్ధతో ముందుకువచ్చి ఆ మందిరనిర్మాణములో పాలుపంచుకున్నారు. సాయంకాలము అయ్యేసరికి వారి శ్రమకు ఫలితంగా వారికి నదిలోని ఇసుక కొంచెం యిచ్చేవాడు. ఆ ఇసుకలోపల వారు ఆనాడు ఎంత కష్టపడ్డారో అంత బంగారము చిక్కేది. అధికంగా లభించేదికాదు. ఎంత కష్టపడతారో ఆ ఫలితము మాత్రమే చిక్కేది. కనుకనే ఆ నదికి 'సువర్ణముఖి' నది అని పేరు వచ్చింది. ఆనాటి ధర్మములు, న్యాయములు, కర్తవ్యములు ఆ విధంగా పవిత్రముగా ఉండేవి. కనుకనే ప్రజలందరూ సమృద్ధిగా, సుక్షేమంగా జీవితాన్ని గడుపుతూవచ్చారు. ఆనాడు దుర్భిక్షములేదు. ఈ విషయము మీకు తెలియదు, మీరు చిన్నపిల్లలు. ఆ పాతకాలము తిరిగి వస్తుందని ఎవరికి నమ్మకములేదు. ఆ రోజుల్లో నాలుగు రూపాయలిస్తే బియ్యపుమూట వచ్చేది. పల్లెలలో, పట్టణాలలో ఎండాకాలం వస్తే తలుపులు తెరచి మిద్దెలపై పడుకునేవారు. ఎట్టి భయముండేదికాదు. రాత్రులలో స్త్రీలు ప్రయాణమై వెళ్లేవారు. వివాహాలు జరిగితే దండిగా నగలంతా ధరించి రాత్రివేళల్లో ప్రయాణము చేసేవారు. దొంగల భయమే లేదు, అప్పుడు. ఇప్పుడు అట్లాకాదు. గాడ్రేజ్‌లో పెట్టినా తీసుకుపోతున్నారు. ఎంత పవిత్రమైన కాలము ఎంత అపవిత్రంగా మారిపోయింది! ఎవరినీ నమ్మడానికి లేదు. ఎవరిని నమ్మినా ఏమి చేస్తాడో, అనే భయమే! స్నేహితునిగా వస్తారు, కూడా బయలుదేరి వెడితే మధ్యలో అతను హతం చేస్తాడు. ధనము ఇన్ని దుర్గుణాలకు మూలకారణంగా మారిపోతున్నాది. ఇది ఎప్పుడు బయలుదేరింది? కేవలం ద్వాపరయుగములో బయలుదేరింది. పూర్వమంతా 'ధర్మమూలం మిదం జగత్' అన్నారు. ధర్మమే ఈ జగత్తు అన్నారు. కానీ ద్వాపరయుగము వచ్చేటప్పటికి 'నాకు ఈ ఆస్తికావాలి, నాకు ఆ ఆస్తి కావాల'ని పాండవులు, కౌరవులు ఆస్తికై పోట్లాడుతూ వచ్చారు. కట్టకడపటికి ఇదే ఒక పెద్ద యుద్ధముగా జరిగిపోయింది. అప్పటినుంచి 'ధనమూలం మిదం జగత్' అయింది. ఈనాటి సమస్త కలహములకు ధనమే మూలకారణం. అన్యాయ, అక్రమ, అసత్యములకంతాకూడను ధనమే మూలకారణం. అసూయ, అహంకార, అడంబరాలకు

sri sathyasai vahini vachanamrutam

ధనమే మూలకారణం. ధనము కావాలిగానీ అధికంగా వుండకూడదు.

**ప్రజలనుండి పోగైన సొమ్ము ప్రజలకొరకే సద్వినియోగము చెయ్యాలి**

ఏ ప్రజలనుంచి ధనం తీసుకున్నామో ఆ ధనాన్ని ప్రజలకే ఖర్చుపెట్టాలి. నీకు ఆఫీసరు జీతం ఇచ్చాడంటావు. ఈ ఆఫీసరుకు ఎవరిచ్చారు? ఆఫీసరుకు బ్యాంకునుండి వచ్చింది, అన్నారు. బ్యాంకుకు ఎవరిచ్చారు? అంతా ప్రజల డబ్బే! ఎక్కడ చూచినా ప్రజల డబ్బే పోగవుతున్నది. ప్రజలనుండి పోగైంది ప్రజలకొరకే సద్వినియోగము చేయాలి. అదే నా సంకల్పము. 'సాయిబాబా త్రాగునీటి ప్రాజక్టులో కోట్లకు కోట్లు ఖర్చుపెడుతున్నారు', అనుకుంటారు. సాయిబాబా కాసు ఒక్కటైనాలేదు అక్కడ. అంతా ప్రజలు ఇచ్చినదే ప్రజలకు పెడుతున్నాను. నాసొత్తు ఏదీలేదు. నాసొత్తు ఒక్కటే, అదే నా పెద్ద ప్రోపర్టీ! అది ఏమిటి? నా పిల్లలే నా ప్రోపర్టీ. నా పిల్లలు సరైన ఆదర్శంగా ఉంటుంటే అదే నాకు చాలు. కనుక, పిల్లలందరు ఏవిధమైన ఆనందముతో, ఉత్సాహముతో ఈ ఆటపాటలలో ప్రవేశించి బహుమతులు పొందారో అదే విధంగా ముందుముందు జీవితములో భగవదాజ్ఞను శిరసావహించి, తద్వారా భగవత్ప్రీతిని పొంది, భగవత్కటాక్షాన్ని అందుకొని, తద్వారా సుఖశాంతులతో జీవించి ఆదర్శవంతమైన విద్యార్థులుగా రూపొందుతారని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను. ప్రేమనుమాత్రం మీరు వదలకండి. ప్రేమకు మించిన ధనము మరొకటిలేదు. ప్రేమకు విలువయేలేదు. అలాంటి ప్రేమచేత మీ జీవితాన్ని ఆనందముగా గడుపండి.

**(తేదీ 14-01-1996న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam